క్లుప్తంగా

ఈవీఎంల పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వీరభద్రప్ప

ఆదోనిరూరల్: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప ఆధ్వర్యంలో సోమవారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లు తడబాటుకు గురికాకుండా యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు నుంచి వస్తున్న నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు గ్రామ ఇన్‌చార్జ్ చెన్నప్పధని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి మండల పరిషత్ గ్రాంట్ రూ.6 లక్షలు విడుదల చేయించడంతో తాగునీటి సమస్యకు పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలోని రెండు బోర్లలో మోటార్లు వేసి పైప్‌లైన్‌కు పైప్‌లైన్‌కు అనుసంధానం చేసి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆదోనిరూరల్: అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం జీవో జారీ చేసిందని, దాని ప్రకారం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆదోని శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇంతవరకు స్థలాలు కేటాయించలేదని, వెంటనే స్థలాలు చూపాలని విజ్ఞప్తి చేశారు. సంఘం అధ్యక్షుడు బసవరాజు, ప్రధాన కార్యదర్శి మునెప్ప, సభ్యులు షంషీర్‌ఖాన్, మల్లికార్జున, మురళీకృష్ణ ఆచారి, తిమ్మప్ప, రఘునాథ్‌రెడ్డి, రుపాస్ నవీన్‌కుమార్, రమేష్‌రెడ్డి, చంద్రమోహన్, చంద్రయ్య, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

కక్షలు మాని ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న సీఐ ఎరిసావలి

మంత్రాలయం: పాత కక్షలు మాని గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సీఐ ఎరిసావలి సూచించారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు.. మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి, మాలపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మాధవరం ఎస్‌ఐ బండెనవాజ్, సిబ్బంది వీరేష్, సోమశేఖర్, వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆదోనివాసికి జ్యోతిష్య బ్రహ్మ అవార్డు



అవార్డు అందుకున్న కమలనాభశర్మ

ఆదోనిఅర్బన్: పట్టణానికి చెందిన జ్యోతిష్యుడు కమలనాభశర్మకు హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఎస్ లైవ్ జ్యోతిష్యం సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నరసింహస్వామి సోమవారం జ్యోతిష్య బ్రహ్మ అవార్డు అందజేశారు. కమలనాభశర్మ మాట్లాడుతూ జ్యోతిష్య శాస్త్రంలో అనుభవం కలిగిన వారిని, అందుకు కృషి చేసిన వారికి అవార్డు అందజేసిందని ఇందుకు తనను ఎంపిక చేశారని చెప్పారు.

గడ్డివాముల దగ్ధం

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. సోమవారం బాధిత రైతులు జానప్ప, సత్యారెడ్డి, రాజన్న మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టారన్నారు. రైతులు, స్థానికులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా వీలుకాలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. రైతులకు రూ.1.90 లక్షలు నష్టం వాటిల్లింది.

నెరవేరనున్న చిరకాల స్వప్నం

- చురుగ్గా ఆదోని బైపాస్ రోడ్డు పనులు
- పరిష్కారంగానున్న ట్రాఫిక్ సమస్య

ప్రజల సమస్యలను పట్టించుకోకుండా తమ వ్యవహార శైలిని చాటుకున్నారు గత పాలకులు. జనం కూడా తమకు అవసరం లేని వారిని తరిమేసి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. దీంతో ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో సఫలీకృతమవుతుండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 14ఏళ్లుగా పట్టణ బైపాస్ రోడ్డు నిర్మాణంపై టీడీపీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కారణం.. వైఎస్సార్ చేపట్టినది కావడమే.. ఎట్టకేలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన రావడంతో రోడ్డు పనులకు నిధులు విడుదల చేయడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.

ఆదోనిటౌన్: పట్టణ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. సుమారు 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆదోని బైపాస్ రోడ్డుకు పునాదులు పడ్డాయి. నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో ఆదోనివాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పనుల వల్ల పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుందంటున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు వైఎస్సార్ హయాంలో 2005లో బైపాస్ రోడ్డు మంజూరు చేశారు. ఆస్పరి–ఎమ్మిగనూరు రోడ్డు, ఆలూరు–మాధవరం రోడ్డుకు లింక్ రోడ్లను ఏర్పాటు చేశారు. మిగిలిన ఆస్పరి–ఆలూరు బైపాస్ (లింక్ రోడ్డు) పనులు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. వైఎస్సార్ అనంతరం ఆస్పరి–ఆలూరు బైపాస్ లింకు రోడ్డును తరువాతి పాలకులు పట్టించుకోలేదు. నిలిచిన బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక నాయకులు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. తండ్రి చేపట్టిన రోడ్డును తనయుడు పూర్తి చేయనుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు లెవెల్‌ను చూస్తున్న ఇంజినీర్



జేసీబీతో బైపాస్ రోడ్డు సరిహద్దులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రోడ్డు ఇలా..

పట్టణంలోని ఆలూరు రోడ్డులోని మహాయోగి లక్ష్మమ్మ ఆర్చ్ నుంచి ఎమ్మిగనూరు రోడ్డులోని 40 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకుంటుంది. బైపాస్ రోడ్డుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గత నెలలో భూమిపూజ చేశారు. మార్చి మొదటి వారంలో కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేశారు. బైపాస్ నిర్మాణం పూర్తయితే పట్టణవాసుల ట్రాఫిక్ కష్టాలు, ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోయినట్లే.

రూ.241.99 కోట్లతో పనులు..

ఎమ్మిగనూరు రోడ్డు ఆంజనేయస్వామి గుడి నుంచి ఆలూరు రోడ్డులోని మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆర్చ్ గేట్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం, భూసేకరణకు రూ.241.99 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.93.46 కోట్లతో 7.303 కి.మీ. బైపాస్ రోడ్డుకు వెచ్చించనున్నారు. మిగిలిన రూ.148.53 కోట్లు రైతుల భూసేకరణకు కేటాయించారు. మైనర్ బ్రిడ్జి ఒకటి, అండర్ పాస్ వెహికల్‌కు ఒకటి, రైల్వే ఓవర్ బ్రిడ్జి ఒకటి, పైపులైన్ కల్వర్ట్స్ రెండు, బాక్స్ కల్వర్ట్స్ 12, మేజర్ జంక్షన్‌లు రెండు, మైనర్ జంక్షన్‌లు ఒకటి ఏర్పాటు చేయనున్నారు. రెండేళ్లలో రోడ్డు పూర్తి చేయాలని నిబంధన ఉంది. నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్167) కింద పనులు జరుగుతున్నాయి.

పనులు వేగవంతంగా జరుగుతున్నాయి



బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండేళ్లలోపే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఎండాకాలం కావడంతో పనులు సులభంగా సాగుతాయి. ఎలాంటి ఆటంకాలు ఉండవు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. – నరసింహమూర్తి

ఏడాదిన్నరలోపే పూర్తిచేసేలా చర్యలు



ఆదోని బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు రెండేళ్లలో పూర్తి చేయాలని నిబంధనలు ఉన్నాయి. అయితే తాము ఏడాదిన్నరలోపే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు వేగవంతం చేశాం. రోలింగ్ పనులు పూర్తయ్యాయి. ఇక గ్రావెల్ వేయడం, లావు సైజ్, చిన్నసైజు కంకర వేసి ఆ తర్వాత బీటీ రోడ్డు పూర్తి చేస్తాం. – బి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్

హామీని నెరవేర్చాం



2019లో ఆదోని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం. అందులో భాగంగానే అర్ధాంతరంగా ఆగిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించాం. నేషనల్ హైవే అథారిటీ కింద 7 కి.మీ. మేర బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఏడాదిలోపు పూర్తవుతాయి. రైతుల భూముల కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.241.99 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణ మొత్తం త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ కానుంది. పట్టణంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. – సాయిప్రసాద్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే

స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించండి



ప్రజల వినతులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలకు గడువు లోపు పరిష్కారం చూపాలని, ఇందులో అలసత్వం తగదని, అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యాలయపు పరిపాలనాధికారి శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవి కుమార్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డీఎల్‌ఈఓ నాగేశ్వరరావు, ఆర్టీఓ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్‌లు వినీత్, కౌసర్‌బాను, పౌర సరఫరాలశాఖ ఉపతహసీల్దార్ వలీబాషాపా ల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- తమ ఇల్లు కొద్ది రోజుల క్రితం కూలిపోయిందని, అందులో ఇంటికి సంబంధించిన పత్రాలు పోగొట్టుకుపోయాని, వాటికి సంబంధించిన పత్రాలు నకలు పత్రాలు ఇవ్వాలని ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామానికి చెందిన లొడ్డ ఈరన్న అర్జీ అందజేశాడు.
- నందవరం మండలం పులిచింత గ్రామానికి చెందిన పోతురాజు నాగన్న గ్రామంలో 20 సంవత్సరాలుగా 2.50 సెంట్ల ఇంటి స్థలంలో నివాసముంటున్నాము. సదరు ఇంటి స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించాడు.
- మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన బి.వెంకటసాయిరంగ గత నెలలో ఐచర్ వాహనం కొనుగోలు చేశాడు. అయితే వాహనం రిజిస్ట్రేషన్ సాంకేతిక సమస్య వల్ల ఆలస్యమవుతుందని, త్వరగా రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలని వినతి పత్రం అందజేశాడు.

అభివృద్ధికి చిరునామా వైఎస్సార్‌సీపీ



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రదీప్ రెడ్డి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వివిధ అభివృద్ధి పనులను సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి, కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణంరాజు, మండల కన్వీనర్ ప్రహ్లాదచారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి పనులు చేసిందన్నారు. గత 50 ఏళ్ల నుంచి కౌతాళంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేదని, ప్రస్తుతం గ్రంథాయానికి స్థలం కేటాయించడమే గాక రూ.20.5 లక్షల నిధులు విడుదల చేసి నూతన భవనం నిర్మించినట్లు చెప్పారు. అలాగే నాడు–నేడు కింద పాఠశాలల మరమ్మతులు, నూతన గదులు, మరుగుదొడ్ల నిర్మించడం, 8వ తరగతి నుంచే ట్యాబ్‌లను పంపిణీ చేయడం వంటి వాటితో పాఠశాలలకు కొత్త కళ వచ్చిందన్నారు. రూ.22 లక్షలతో కన్నడ ప్రాథమిక పాఠశాల మరమ్మతులు చేసినట్లు చెప్పారు. ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాటం ప్రకాశ్, గ్రంథాలయ అధికారులు మక్బుల్, హరి, కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, నాయకులు వీరసేనరెడ్డి, దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, భీమేష్, అబ్దుల్ సమద్, అవతారం, రాజ్‌అహ్మద్, వడ్డెరాము ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈరన్న ఆలయంలో భక్తుల రద్దీ



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. ఆదివారం అమావాస్యకు వచ్చిన భక్తులు సోమవారం కూడా స్వామి దర్శనానికి వేచి ఉండడంతో స్వామి క్షేత్రం కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్నికల విధులపై అవగాహన



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల విధులపై నియోజకవర్గ నోడల్ ఆఫీసర్లకు సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటిపై త్వరలో జిల్లాస్థాయిలో శిక్షణ ఇస్తారని చెప్పారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు, 26 సెక్టోరియల్, రూట్ ఆఫీసర్ టీమ్స్, 16 నోడల్ ఆఫీసర్ టీమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, తహసీల్దార్ హసీనా సుల్తానా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌వర్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వై.రామేశ్వర్‌రెడ్డి, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, డీఎల్‌డీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు.



కళాకారులతో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

ఘనంగా గురు వైభవోత్సవం



అవార్డు అందుకుంటున్న కర్ణాటక సంస్కృతి యూనివర్సిటీ ప్రొఫెసర్ శరణప్ప

మంత్రాలయం: సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నేతృత్వంలో పవిత్ర దీప ప్రజ్వలనతో వేడుకలకు అంకుర్పారణ పలికారు. సాయంత్రం గ్రామదేవర, రాఘవేంద్ర స్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి యోగీంద్ర మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖులకు అవార్డుల ప్రదానం చేశారు. కర్ణాటక సంస్కృతి విద్యాలయం ప్రొఫెసర్ శరణప్ప, రాయచూర్ జిల్లా ఎస్పీ నిఖిల్ దంపతులకు అవార్డులను అందజేశారు. కర్ణాటక హుబ్లీ భావదీప శిక్షణ సంస్థ విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బెంగళూరుకు చెందిన విదూషి గీతకచేరి అలరించింది. మఠం మేనేజర్లు శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

ఆదోనిసెంట్రల్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రతి రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో చేర్చాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు బి.రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ బి.మహాదేవప్ప, సి.నాగరాజు కోరారు. సోమవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదోని మండల, పట్టణ, కౌతాళం శాఖల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అలాగే 12వ పీఆర్‌సీని వెంటనే 40 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి. సుంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు ఈహెచ్‌ఎస్‌లో అన్ని వ్యాధులకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.గోపాల్, నాయకులు భీమరాజు, రామకృష్ణ, గణేష్, విశ్వనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పెద్దకడబూరు: మండలంలోని గ్రామాల్లో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి సోమవారం మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి చేతులమీదుగా.. నూతనంగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్, ఓహెచ్ఎస్ఆర్‌లు ప్రారంభిస్తారని చెప్పారు. దొడ్డిమేకల గ్రామంలో సచివాలయం, కల్లుకుంటలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌తో పాటు డ్రైనేజీ, సీసీ రోడ్డుకు భూమిపూజ, కంబలదిన్నిలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, నాగులాపురంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బసలదొడ్డిలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, తారాపురంలో ఓహెచ్ఎస్ఆర్, చిన్నకడబూరులో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

కోసిగి: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎస్ఐ సతీష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ సభానా సమక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పదో తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ హాజరై మాట్లాడుతూ.. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రభుత్వం ఆడ పిల్లల చదువు కోసం అన్ని వసతులు కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఏఐఎస్ఎఫ్ తాలుకా కార్యదర్శి రాజు, మండల కార్యదర్శి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీని గెలిపించుకునేందుకు సిద్ధం



బూదూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు భీమారెడ్డి

మంత్రాలయం: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామని పార్టీ మండలాధ్యక్షుడు భీమా రెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో బూత్ నంబర్లు 82, 83ను సందర్శించి 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీతోనే గ్రామ స్వరాజ్యం



డి.బెళగల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి

కోసిగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం కోసిగి మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. మండలంలోని పెద్దభూపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే డి.బెళగల్‌లో రూ.17.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, రూ.30 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు పనుల శిలాఫలకాన్ని ప్రారంభించారు. అలాగే పల్లెపాడులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. కోసిగిలో రూ.20 లక్షలతో గ్రంథాలయం, రూ.2.14 కోట్ల నాబార్డు నిధులతో బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన 10 అదనపు తరగతి గదులను ప్రారంభించారు. సాతనూరులో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగనన్న స్థాపించారన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా తీసుకొచ్చి గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నాడన్నారు. ప్రజలు ఎక్కడకీ తిరగాల్సిన పనిలేకుండా గ్రామంలోనే రేషన్ కార్డు మొదలుకొని అన్ని రకాల అందుతున్నాయన్నారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, ఇల్లూరి ఆదినారాయణ, జగదీష్ స్వామి, బుల్లి నరసింహులు, నాడుగేని వీరేష్, కోసిగయ్య, బండ్ల గోవిందు, షౌకత్ ఆలి, పీఆర్ డీఈ అశ్వత్థామ, ఏడీఏ, బాలవర్ధిరాజు, ఎంపీడీఓ ప్రభావతి, ఏఈలు యుగంధర్ రెడ్డి, నరసింహులు, ఏఓ రాజు, డాక్టర్ నజీర్ అహ్మద్, డాక్టర్ రజిత, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భక్త కనకదాసు విగ్రహావిష్కరణ



కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: కురవ కులస్తుల ఆరాధ్యదైవం భక్త కనకదాసు విగ్రహావిష్కరణ కౌతాళంలో అట్టహాసంగా జరిగింది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. కురువలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మరోసారి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సుమారు రూ.6.80 లక్షలతో ఏర్పాటు చేసిన క్యాంస విగ్రహాన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు శివన్న, శివరాం, నాగభూషణ్ గౌడ్, రాఘవేంద్ర రెడ్డి, సుబ్బారాజు, వడ్డెరాము, భీమేష్, అబ్దుల్‌సమద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడపకు చేరాయని వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ పేర్కొన్నారు. సోమవారం మేజర్ పంచాయతీ మండిగిరిలో గడప గడపకు సంక్షేమం పేరుతో వర్తించిన పథకాల గురించి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. 98 శాతం హామీలను నెరవేర్చి ఘనత జగనన్నదేన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ధనుంజయరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్, దమ్మురి లక్ష్మన్న, కడితోట ఈరన్న, సలకలకొండ వీరారెడ్డి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆదోని, మంత్రాలయం

97054 44304 (ఆదోని)

70750 09147 (మంత్రాలయం)

Office mail : sakshiknladvt@gmail.com